
సాక్షి గుంటూరు


ఆదివారం । 24 । మార్చి । 2024



కల్యాణ మహోత్సవం
పెదపులివర్రు(భట్టిప్రోలు): పెదపులివర్రులో కొలువైన భూ–నీళా సమేత వరదరాజ స్వామి బ్రహ్మోత్సవాలలో భాగంగా శనివారం రాత్రి బలిహరణ నిర్వహించారు.



సాగర్ నీటిమట్టం
విజయపురిసౌత్:నాగార్జునసాగర్ జలాశయ నీటిమట్టం శనివారం 513.60 అడుగుల వద్ద ఉంది. ఎస్ఎల్‌బీసీకి 450 క్యూసెక్కులు విడుదలవుతోంది.



రంజాన్ వేళలు

	ఇఫ్తార్ (ఆది)	సహరి (సోమ)
గుంటూరు	6.24	4.54
బాపట్ల	6.24	4.52
నరసరావుపేట	6.26	4.52

న్యూస్‌రీల్

మొసలిని పట్టుకున్న ఫారెస్టు అధికారులు



గురజాల: నగర పంచాయతిలోని లక్ష్మీటాకీసు సెంటర్‌లో గల ఒద్దుల వాగులో కొద్ది రోజుల కిందట మొసలి కలకలం రేపిన సంఘటన పాఠకులకు విదితమే. మొసలి రాత్రి సమయాల్లో బయటకు వస్తున్న విషయాన్ని స్థానికులు గమనించారు. శనివారం తెల్లవారుజామున మూడు గంటల సమయంలో మొసలి ఒడ్డుకు రావడాన్ని గమనించిన స్థానికులు ఫారెస్టు అధికారులకు సమాచారం అందించారు. తెల్లవారుజామున దైద ఫారెస్టు బీట్ ఆఫీసర్ బి నాగేశ్వరరావు తన సిబ్బందితో కలసి వచ్చి మొసలిని అదుపులోకి తీసుకుని పొందుగుల కృష్ణానదిలో వదిలిపెట్టారు. చెరువులో మరొక మొసలి కూడా ఉన్నట్లు స్థానికులు చెబుతున్నారు. ఈ కార్యక్రమంలో ఫారెస్టు స్ట్రైకింగ్ ఫోర్సు సిబ్బంది పాల్గొన్నారు.

డీఐఓ ఆకస్మిక తనిఖీ



కారెంపూడి: కారెంపూడి ఇందిరానగర్ కాలనీలోని ఆరోగ్య ఉప కేంద్రంలో జరుగుతున్న వ్యాధి నిరోధక టీ కాల కార్యక్రమాన్ని జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి(డీఐఓ) డాక్టర్ పి గీతాంజలి శనివారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. గర్భిణులు, చిన్నారులకు వేస్తున్న టీకాల వివరాలు ఎంసీపీ రిజిస్టర్‌లో నమోదు చేస్తున్నారా లేదా అనే విషయాన్ని పరిశీలించారు. మాతా శిశు సంరక్షణ రిజిస్టర్‌ను పరిశీలించారు. జిల్లా కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ కె వెంకటేశ్వర్లు, కారెంపూడి పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ ఎం రమ్య, డాక్టర్ కె లక్ష్మీమౌనిక, సీహెచ్‌ఓ మల్లయ్య, ఏఎన్ఎంలు, ఆశా వర్కర్లు పి పిసమ్మ, బి విమల, బి రాజేశ్వరి, కె రాజేశ్వరి, ఎ ధనలక్ష్మి పాల్గొన్నారు.

ఏపీఆర్ డిగ్రీ కళాశాలలో ప్రవేశానికి దరఖాస్తుల ఆహ్వానం

విజయపురిసౌత్: స్థానిక ఏపీఆర్ డిగ్రీ కళాశాల (బాలుర)లో మొదటి సంవత్సరంలో చేరేందుకు ఏపీఆర్‌డీసీ సెట్–2004 ప్రవేశ పరీక్షకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని కళాశాల ప్రిన్సిపాల్ వైఎస్ఎస్ చౌదరి శనివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఆన్‌లైన్‌లో ఈనెల 31వ తేదీకల్లా దరఖాస్తు చేసుకోవాలన్నారు. ప్రవేశ పరీక్ష ఏప్రిల్ 25వ తేదీ మధ్యాహ్నం 2.30 నుంచి 5గంటల వరకు జరుగుతుందన్నారు. ఈ పరీక్ష 26 జిల్లా కేంద్రాలలో జరుగుతుందన్నారు.

కల్యాణం....కమనీయం

- దేవరంపాడులో వేడుకగా మహోత్సవం
- గోవిందనామస్మరణతో మారుమోగిన ఆలయం



రాజుపాలెం: దేవరంపాడు కొండపై మత్స్య రూపంలో వెలసిన వేంకటేశ్వరుడి తిరునాళ్ల శనివారం వైభవంగా జరిగింది. స్వామివారి కల్యాణ మహోత్సవాన్ని వేద పండితులు వేద మంత్రోచ్చారణల మధ్య కనుల పండువగా నిర్వహించారు. కల్యాణ మహోత్సవానికి రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబు హాజరై మొక్కులు తీర్చుకున్నారు. ముందుగా రాష్ట్ర మంత్రి అంబటి స్వామివారికి పట్టు వస్త్రాలను, తలంబ్రాలను తీసుకురాగా వేద పండితులు పూర్ణకుంభంతో మంత్రోచ్చారణ, బ్యాండ్ వాయిద్యాలతో కల్యాణ వేదిక వద్దకు తీసుకెళ్లారు. సమీప ప్రాంతాల నుంచే గాక, సుదూర ప్రాంతాల నుంచి వేలాది మంది భక్తులు దేవరంపాడు కొండకు విచ్చేసి స్వామి వారిని దర్శనం చేసుకొని మొక్కులు తీర్చుకున్నారు. గోవింద నామస్మరణతో కొండ మారుమ్రోగింది. భక్తులు స్వామివారికి పొంగళ్లు చేసి, నెయ్యి, బెల్లం, పప్పు వగైరాలు సమర్పించారు. పశుసంపదను కాపాడాలని స్వామివారికి నెయ్యిని సమర్పించి మొక్కుకున్నారు. కల్యాణం అనంతరం స్వామివారిని పల్లకీలో ఊరేగించారు. వారి వెంట మండల కన్వీనర్ వేపూరి శ్రీనివాసరావు, దేవస్థాన కమిటీ చైర్మన్ శాఖమూరి శ్రీనివాసరావు, జెడ్పీటీసీ సభ్యురాలు దొంతిరెడ్డి సునీత, నాయకులు శ్రీనివాసరెడ్డి, సర్పంచ్ పత్తిపాటి దీనమ్మ కోటేశ్వరరావు, ఈఓ గుర్రం శ్రీనివాసరెడ్డి తదితరులు ఉన్నారు. అనంతరం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

అభివృద్ధి..మంగళాద్రి

- మంగళగిరి–తాడేపల్లి నగర పాలక సంస్థ ఏర్పడి మూడేళ్లు
- రాష్ట్రంలోనే రెండో అతిపెద్ద కార్పొరేషన్
- రూ.123 కోట్లతో డొంక, లింకు రహదారుల నిర్మాణం
- కార్పొరేషన్ అభివృద్ధిపై సీఎం వైఎస్ జగన్ ప్రత్యేక శ్రద్ధ



పాతబస్టాండ్ ఆవరణలోని ప్రగడ కోటయ్య, వైఎస్సార్ చేనేత భవనం

మంగళగిరి: మంగళగిరి–తాడేపల్లి కార్పొరేషన్ అభివృద్ధి పథంలో పయనిస్తోంది. కార్పొరేషన్ ఏర్పడి శనివారంతో మూడేళ్లు పూర్తయ్యింది. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రత్యేక శ్రద్ధ ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి(ఆర్కే) చొరవతో అభివృద్ధి శరవేగంగా జరుగుతుంది. మంగళగిరి–తాడేపల్లి పట్టణాలతోపాటు రెండు మండలాల్లోని 21 గ్రామాలను కలిపి మంగళగిరి–తాడేపల్లి కార్పొరేషన్(ఎంటీఎంసీ)గా ఏర్పాటుచేస్తూ 2021వ సంవత్సరం మార్చి 23వ తేదీన ప్రభుత్వం జీఓ జారీ చేసింది.

- మంగళగిరి, తాడేపల్లి నగర పాలక సంస్థలో 3.50 లక్షల జనాభా ఉన్నారు. కార్పొరేషన్ 194 చదరపు కిలోమీటర్ల విస్తీర్ణంతో రాష్ట్రంలోనే రెండో అతి పెద్ద కార్పొరేషన్‌గా రూపుదిద్దుకుంది.

అభివృద్ధికి 'బాట'లు

కార్పొరేషన్‌గా అవతరించిన వెంటనే రోడ్ల విస్తరణతోపాటు కమ్యూనిటీ హాళ్ల నిర్మాణం, వైఎస్సార్ అర్బన్ హెల్త్ సెంటర్‌ల నిర్మాణాలు, చేనేత భవనం, మగ్గాల షెడ్ల నిర్మాణంతోపాటు పలు అభివృద్ధి పనులు చేపట్టారు.

- మంగళగిరి పట్టణంలోని ప్రధాన రహదారిలో నిత్యం ట్రాఫిక్ రద్దీగా ఉండేది. దీంతో నగర ప్రజలు ఇబ్బందులకు గురయ్యేవారు. గతంలో అధికారంలో ఉన్న ఏ పార్టీ కూడా సమస్యను పట్టించుకున్న దాఖలాలు లేవు. వైఎస్సార్ సీపీ అధికారంలోకి వచ్చిన వెంటనే ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి(ఆర్కే) రూ.24 కోట్లతో గౌతమబుద్దా రోడ్డు విస్తరణ చేశారు. రూ.123 కోట్లతో విలీన గ్రామాలలో డొంక రోడ్లు, లింకు రోడ్ల నిర్మాణాలు పూర్తి చేశారు. మరో రూ.రెండు కోట్లతో తాగునీటి పథకానికి నూతన పంప్‌హౌస్ నిర్మించి తాగునీటి సమస్యను పరిష్కరించారు.

▶ 'సామాజిక' మార్పు

రూ.10 కోట్లతో నగరంలోని ప్రతి సామాజికవర్గానికి కమ్యూనిటీ హాళ్లు నిర్మించడంతో ఆయా సామాజిక వర్గాలలోని ప్రజలు హర్షాతిరేకాలు వ్యక్తం చేస్తున్నారు.

▶ చేనేత పరిశ్రమకు ప్రాధాన్యం

మంగళగిరి అంటేనే గుర్తు వచ్చేది చేనేత పరిశ్రమ. పరిశ్రమ అభివృద్ధికి గతంలో ఎన్నడూ లేని విధంగా కృషి చేస్తున్నారు.

- మంగళగిరి పట్నంలో 1500 కుటుంబాలకు పైగా మగ్గాల షెడ్లపై ఆధారపడి జీవిస్తున్నాయి. వీరి సంక్షేమానికి ప్రభుత్వం రూ.3.50 కోట్లతో మగ్గం షెడ్లు నిర్మాణం చేపట్టి పూర్తిచేసింది.
- నగరంలో ఇప్పటికే రూ.474 కోట్లు పనులు పూర్తిగా మరో రూ.217 కోట్లు పనులు శరవేగంగా కొనసాగుతున్నాయి.
- నగరంలోని క్రీడాకారులకు ప్రత్యేకంగా వసతుల ఏర్పాటు చర్యలు తీసుకుంటున్నారు. రూ.ఏడు కోట్లతో స్విమ్మింగ్ పూల్, స్కేటింగ్ ట్రాక్, పవర్ లిఫ్టింగ్ కోచ్ సెంటర్‌లు నిర్మించారు. నూతనంగా షటిల్ ఇండోర్ స్టేడియం నిర్మాణం చేస్తున్నారు.

వైద్య, ఆరోగ్యానికి పెద్దపీట

మంగళగిరి–తాడేపల్లి నగర పాలక సంస్థ ఆవిర్భవించిన అనంతరం ప్రభుత్వం వైద్య ఆరోగ్య రంగానికి పెద్దపీట వేసింది. రూ.15.50 కోట్లతో వైఎస్సార్ అర్బన్ హెల్త్ సెంటర్‌ల నిర్మాణం చేపట్టింది. సెంటర్‌ల నిర్మాణం పూర్తయ్యి ప్రజలకు అందుబాటులోకి రావడంతో ఇంటి వద్దనే నాణ్యమైన సేవలందుతున్నాయి.

- ఇందిరానగర్ హెల్త్ సెంటర్ రాష్ట్రానికే ఆదర్శంగా నిలిచింది. 96.02 మార్కులతో దేశంలోనే ప్రథమస్థానంలో నిలిచి ప్రజలకు వైద్యసేవలందించడంతో ఆదర్శంగా వైఎస్సార్ అర్బన్ హెల్త్ సెంటర్‌లు నిలుస్తున్నాయనడంలో సందేహం లేదు.



వైఎస్సార్ అర్బన్ హెల్త్ సెంటర్

త'స్మార్ట్'.. శృతిమించొద్దు!

- సామాజిక మాధ్యమాల్లో ఎన్నికల ప్రచారంపై ఆంక్షలు
- మీడియా సర్టిఫికేషన్ మానిటరింగ్ కమిటీ అనుమతి తప్పనిసరి
- శృతిమించిన, అసత్య ప్రచారాలపై కేసులు నమోదు
- నేరం రుజువైతే పదేళ్ల జైలు, రూ.2లక్షల జరిమానా
- వివాదాస్పద పోస్టులు చేసినా, ఫార్వర్డ్ చేసినా బాధ్యులే
- మార్గదర్శకాలు నిర్దేశించిన కేంద్ర ఎన్నికల సంఘం



కొరిటెపాడు(గుంటూరు): సార్వత్రిక ఎన్నికల సందడి మొదలైంది. ఆయా పార్టీల నేతలు ప్రత్యక్షంగా ఓటర్లను కలవడంతో పాటు సామాజిక మాధ్యమాల(వాట్సాప్, ఫేస్‌బుక్, ట్విట్టర్, యూ ట్యూబ్, ఇన్‌స్టాగాం) ద్వారా ప్రచారాన్ని హోరెత్తిస్తున్నారు. అయితే సోషల్ మీడియాలో శృతిమించిన, అసత్య ప్రచారం చేపడితే పోలీసు కేసులు నమోదు చేయడంతో పాటు.. జైలు శిక్షలు పడే అవకాశం ఉంది. ఈ నేపథ్యంలో కేంద్ర ఎన్నికల సంఘం సోషల్ మీడియాకు కూడా ఎలక్ట్రానిక్ మీడియాకు మాదిరిగానే ఎన్నికల నిబంధనలు వర్తింపజేస్తోంది.

'సోషల్' ప్రచారం..పెయిడ్ న్యూస్ కిందకే..

సామాజిక మాధ్యమాల్లో ఎన్నికల ప్రచారం చేస్తే.. ఆయా పార్టీలు, అభ్యర్థులు వెచ్చిస్తున్న ఖర్చు వివరాల నివేదికను ఎన్నికల సంఘానికి అందజేయాల్సి ఉంటుంది. సోషల్ మీడియాలో ప్రచారం కూడా పెయిడ్ న్యూస్ కిందకే వస్తుంది. దీంతో ఈ ఖర్చు అభ్యర్థి ఎన్నికల ఖాతాలోకి వెళ్తుంది.

ఫార్వర్డ్ చేసినా నేరమే..

ఎన్నికల నిబంధనలకు విరుద్ధంగా ఎవరైనా తమ వాట్సాప్, ఫేస్‌బుక్ వేదికల్లో పోస్టింగ్ చేసినా, సందేశాలను ఫార్వర్డ్ చేసిన వారిపై కూడా చర్యలు ఉంటాయి.

గ్రూప్ అడ్మిన్ బాధ్యతలివే..

సోషల్ మీడియాలో గ్రూప్ సభ్యులు అభ్యంతరకరమైనా.. వివాదాస్పద పోస్టులు, కామెంట్స్ పెట్టినా వెంటనే వాటిని అడ్మిన్ డిలీట్ చేయాలి. లేదంటే పోస్టింగ్ చేసిన సభ్యుడితో పాటు గ్రూపు అడ్మిన్ బాధ్యత వహించాల్సి ఉంటుంది. ప్రస్తుత ఎన్నికల నిబంధనల మేరకు.. పోలింగ్‌కు 48 గంటల ముందే సోషల్ మీడియాలో ఎన్నికల ప్రచారాన్ని నిలిపివేయాలి.

అధికారుల నిరంతర నిఘా

సోషల్ మీడియాపై అన్ని శాఖల అధికారులు నిఘా ఉంచుతారు. ఫొటో మార్ఫింగ్, అశ్లీల చిత్రాలు పంచుకోవడం, ఇతరుల మనోభావాలు దెబ్బతినే విధంగా ఫొటోలు, సందేశాలు ఉంటే వాటిని ఐటీ యాక్ట్–2000 కిందకు తీసుకొచ్చి.. సెక్షన్–67 కింద జైలు శిక్షతో పాటు జరిమానా విధించే అవకాశం ఉంది. నేరం రుజువైతే పదేళ్ల వరకు జైలు శిక్షతో పాటు రూ.2 లక్షల జరిమానా విధిస్తారు.

సోషల్ మీడియా.. మార్గదర్శకాలు ఇవే

- సామాజిక మాధ్యమాల్లో వ్యక్తిగతంగా, పార్టీలపై, సంస్థలు, అధికార యంత్రాంగంపై అసత్య ప్రచారం చేయకూడదు. పోటీ చేసే అభ్యర్థులపై కార్టూన్స్, మీమ్స్, షార్ట్ వీడియోల ద్వారా అసత్య ప్రచారం చేసినట్లు ఎవరైనా తగిన ఆధారాలతో ఫిర్యాదు చేస్తే.. వెంటనే పోలీసులు, ఎన్నికల అధికారులు కేసులు నమోదు చేసే అవకాశం ఉంది.
- చట్ట విరుద్ధమైన ప్రకటనలతో, రాజ్యాంగ ఉల్లంఘన, ఎన్నికల కోడ్‌కు వ్యతిరేకంగా ప్రచారం చేయొద్దు.
- అసత్య ప్రచారం చేస్తే ఐపీసీ–504, 505 సెక్షన్ల కింద కేసులు నమోదు చేసే అవకాశం ఉంది.
- సోషల్ మీడియాలో ఎన్నికల ప్రచార ప్రకటనలకు ముందు.. జిల్లా, రాష్ట్ర స్థాయిలోని మీడియా సర్టిఫికేషన్ మానిటరింగ్ కమిటీ అనుమతి పొందాల్సి ఉంటుంది.

కల్పవృక్ష వాహనంపై దేవదేవుడు

- పొన్న వాహనంపై చిన్నికృష్ణుడు
- గోపికలతో ఆటాపాట



కల్పవృక్షవాహనంపై విహరిస్తున్న దేవదేవుడు

మంగళగిరి:పట్టణంలోని శ్రీలక్ష్మీనృసింహస్వామి వారి బ్రహ్మోత్సవాలలో భాగంగా శనివారం ఉదయం కల్పవృక్ష వాహనం శ్రీదేవి భూదేవి సమేత శ్రీవారు గ్రామోత్సవంలో భక్తులకు దర్శనమిచ్చారు. దేదీప్యమానంగా వెలుగొందుతూ స్వామివారు మాడవీధులలో విహరిస్తూ భక్తులకు దర్శనమివ్వగా దర్శించుకున్న భక్తులు భక్తిపరవశ్యంలో మునిగి తేలారు. ఉత్సవ ఏర్పాట్లును ఆలయ ఈఓ ఏ రామకోటిరెడ్డి పర్యవేక్షించగా ఉత్సవ కైంకర్యపరులుగా మంగళగిరి పట్టణ పద్మశాలీయ బహుత్తమ సంఘం వ్యవహరించారు. విశ్రాంత అధికారి ఆకురాతి కోదండ రామయ్య అన్నమాచార్య కీర్తనలు, భరతనాట్య నృత్య ప్రదర్శన, కూచిపూడి నృత్యం, చిన్నారి కృష్ణుడు చేసిన అల్లరి సాంస్కృతిక కార్యక్రమాలు భక్తులను పరవశింపజేశాయి.

నేడు స్వామి వారి కల్యాణ మహోత్సవం

బ్రహ్మోత్సవాలలో ప్రధాన ఘట్టమైన స్వామి కల్యాణ మహోత్సవం ఆదివారం తెల్లవారుజామున నిర్వహించనున్నట్లు ఆలయ ఈఓ ఏ రామకోటిరెడ్డి తెలిపారు. ఆదివారం ఉదయం అశ్వవాహనంపై గ్రామోత్సవంలో భక్తులకు దర్శనమిచ్చిన స్వామి వారు రాత్రి ఎదుర్కోల ఉత్సవాన్ని కోలాహలంగా జరుపుకుని కల్యాణవేదికపై వేంచేసి దర్శనమిస్తారు. కల్యాణ మహోత్సవానికి హాజరయ్యే భక్తుల కోసం స్వామి వారి కల్యాణ వేదిక మైదానంలో అన్ని ఏర్పాట్లు పూర్తి చేయడం జరిగిందని తెలిపారు.

వేసవిని ఎదుర్కొనేందుకు పటిష్ట విధానం

జిల్లా కలెక్టర్ ఎం.వేణుగోపాల్‌రెడ్డి

గుంటూరు వెస్ట్ : వేసవిలో తాగునీటి ఎద్దడిని నివారించడంతోపాటు ఇతర అంశాలపైనా పటిష్ట ప్రణాళికలు రూపొందించామని జిల్లా కలెక్టర్ ఎం.వేణుగోపాల్‌రెడ్డి తెలిపారు. శనివారం విజయవాడలోని సీఎస్ క్యాంపు కార్యాలయం నుంచి ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి డాక్టర్ కెఎస్ జవహర్‌రెడ్డి నిర్వహించిన సమావేశంలో కలెక్టర్, అధికారులు వర్చువల్ విధానంలో పాల్గొన్నారు. కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో తాగునీటి పథకం ద్వారా ప్రజలకు నీరు సక్రమంగా అందే విధంగా చర్యలు తీసుకుంటున్నామన్నారు. నాగార్జునసాగర్ కుడి కాలువ, కృష్ణ వెస్ట్రన్ డెల్టా కెనాల్స్‌కి నీరు విడుదల చేసిన వెంటనే గ్రామీణ ప్రాంతాల్లో ఉన్న 144 సమ్మర్ స్టోరేజీ ట్యాంకులను నింపేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. తాడికొండ, ప్రత్తిపాడు నియోజకవర్గాల్లో నీటి ఇబ్బంది ఉన్న 34 గ్రామాలకు ట్యాంకర్ల ద్వారా సరఫరా చేసేందుకు ప్రణాళికలు సిద్ధం చేశామన్నారు. గుంటూరు, మంగళగిరి, తాడేపల్లి నగర పాలక సంస్థతోపాటు తెనాలి, పొన్నూరు ప్రాంతాల్లోనూ తాగునీటి సమస్యలు తలెత్తకుండా యాక్షన్ ప్లాన్ అమలుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. శివారు ప్రాంతాల్లోనూ నీటి సరఫరా ట్యాంకర్ల ద్వారా జరుగుతుందన్నారు. ఉపాధి హామీ పథకం పనులకు నిర్దేశించిన వేతనాలు, పనిదినాలు కల్పించేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. సమ్మర్‌లో ఎదురయ్యే అన్ని సవాళ్లను ఎదుర్కొనేందుకు సిద్ధంగా ఉన్నామని కలెక్టర్ వివరించారు. సమావేశంలో ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ నరేష్, సీపీఓ శేషశ్రీ, డ్వామా పీడీ ఉమాదేవి, జీఎంసీ ఎస్ఈ శ్యామ్‌సుందర్ అధికారులు పాల్గొన్నారు.

బాధితులకు న్యాయం చేరువకావాలి



మాట్లాడుతున్న జిల్లా ఎస్పీ తుషార్ డూడీ

నగరంపాలెం: జిల్లా పరిధిలోని కోర్టుల్లో శిక్షలు శాతం పెరిగే విధంగా పబ్లిక్ ప్రాసిక్యూటర్లు (పీపీ)లు కృషి చేయాలని జిల్లా ఎస్పీ తుషార్ డూడీ అన్నారు. శనివారం జిల్లా పోలీస్ కార్యాలయం (డీపీఓ) ఆవరణలో ఉమ్మడి జిల్లా పబ్లిక్ ప్రాసిక్యూటర్లు (పీపీ), సహాయ పబ్లిక్ ప్రాసిక్యూటర్ల (ఏపీపీ) సమావేశం నిర్వహించారు. జిల్లా ఎస్పీ మాట్లాడుతూ పోలీస్ అధికారులు, పీపీలు, ఏపీపీలు పరస్పరం సహకారం అందించుకోవాలని అన్నారు. తద్వారా నేరస్తులకు ఖచ్చితంగా శిక్ష పడేలా చూడవచ్చన్నారు. పరస్పర భాగస్వామ్యంతో సందేహాలు నివృత్తి చేసుకున్నట్‌లైతే, బాధితులకు న్యాయం జరుగుతుందని చెప్పారు. బాధితులకు న్యాయం అందించేందుకు, పోలీస్ అధికారుల న్యాయపరమైన సందేహాలను నివృత్తి చేసేందుకు సిద్ధంగా ఉన్నామని డిప్యూటీ డైరెక్టర్ ఆఫ్ ప్రాసిక్యూషన్ మధుసూదనరావు, పీపీలు, ఏపీపీలు తెలిపారు. అనంతరం జిల్లా ఎస్పీని సత్కరించారు. కార్యక్రమంలో జిల్లా ఏఎస్పీ (క్రైం) శ్రీనివాసరావు, ఏపీ రాష్ట్ర బార్ కౌన్సిల్ సభ్యులు బ్రహ్మారెడ్డి, ఉమ్మడి జిల్లాకు చెందిన పీపీలు, ఏపీపీలు ఎస్‌బీ సీఐ వెంకటరావు పాల్గొన్నారు.

ఇన్నోవేషన్ హబ్‌కు రూ.2 కోట్లు భూరి విరాళం

- తులసి సీడ్స్ అధినేత తులసీ రామచంద్రప్రభుకు ఏఎన్‌యూ విశిష్ట ప్రతిభ పురస్కారం ప్రదానం



తులసి రామచంద్రప్రభుకు విశిష్ట ప్రతిభ పురస్కారం అందజేస్తున్న వీసీ రాజశేఖర్ తదితరులు

నగరంపాలెం: ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం (ఏఎన్‌యూ)లో నూతనంగా ప్రారంభంకానున్న ఇన్నోవేషన్ హబ్‌కు తులసి సీడ్స్ అధినేత తులసి రామచంద్రప్రభు రూ.2 కోట్ల భూరి విరాళం ప్రకటించారు. శనివారం ఏఎన్ యూలో తులసి రామచంద్రప్రభుకి విశిష్ట ప్రతిభ పురస్కార్‌ను ప్రదానం చేశారు. అభిమానంతో తన సేవలను గుర్తించి, ప్రతిభా పురస్కారం అందించడంపై పురస్కార గ్రహీత తులసి రామచంద్రప్రభు కృతజ్ఞతలు తెలిపారు. ఇటువంటి పురస్కారాలు మరెన్నో సేవా కార్యక్రమాలు చేసేందుకు ప్రోత్సహించేలా ఉందని అన్నారు. ఇక్కడ నూతనంగా ఏర్పాటు చేయనున్న ఇన్నోవేషన్ హబ్‌కు తులసి సంస్థల నుంచి రూ.2 కోట్లను ప్రకటిస్తున్నట్లు తెలిపారు. నూతన ఆవిష్కరణలంటే ఎంతో ఇష్టమని అన్నారు. దాని పట్ల ముగ్ధుడినై వర్సిటీకి ఆర్థిక సహకారం అందిస్తానని పేర్కొన్నారు. చిన్నప్పటి నుంచి కష్టపడి ఈ స్థాయికి చేరానని తెలిపారు. రూ.16 పరీక్ష ఫీజు చెల్లించలేనప్పుడు సమాజం తోడ్పాటు అందించిందని గుర్తు చేశారు. అందులో భాగంగా ఇప్పటి వరకు రూ.22 కోట్లను ఉపకార వేతనాల కింద పంపిణీ చేశానని తెలిపారు. ప్రతి ఒక్కరూ సమాజ అభివృద్ధికి రుణపడాలని అన్నారు. తులసి సీడ్స్‌ను ప్రారంభించి, నాణ్యమైన విత్తనాలతో రైతుల్లో మంచి గుర్తింపు లభించిందని అన్నారు. ఏదైనా సాధించాలంటే వంద శాతం లక్ష్యం విద్యార్థుల్లో ఉండాలని సూచించారు. ఉప కులపతి ఆచార్య పి.రాజశేఖర్ మాట్లాడుతూ తులసీ రామచంద్రప్రభు సమాజాభివృద్ధికి తోడ్పాటు అందించడం అభినందనీయమని చెప్పారు. విద్యార్థుల విద్యకై ఉపకార వేతనాలు అందించడం ప్రశంసనీయమని అన్నారు. గుంటూరు వాసిగా తులసి రామచంద్రప్రభు చేపడుతున్న సేవలు చరిత్రలో నిలిచిపోతాయని పేర్కొన్నారు. ఇటువంటి మహోన్నతమైన వ్యక్తిత్వం ఉన్న వారిని విశిష్ట ప్రతిభ పురస్కారంతో సత్కరించడం ఆనందంగా ఉందన్నారు. కార్యక్రమంలో రెక్టార్ ఆచార్య పి.సిద్ధయ్య, రిజిస్ట్రార్ ఆచార్య బి.కరుణ, ఆచార్యులు శ్రీనివాసరెడ్డి, గంగాధర్‌రావు, ప్రమీలరాణి తదితరులు పాల్గొన్నారు. తొలుత తులసి సీడ్స్ ఎదుగుదల, తులసి రామచంద్రప్రభు జీవితాన్ని సాంస్కృతిక విభాగం విద్యార్థులు ప్రదర్శించిన తీరు పలువుర్ని ఆకట్టుకుంది.

బిడ్డకు జన్మనిచ్చి.. తిరిగిరాని లోకాలకు

- మానవత్వాన్ని మరచిన ప్రైవేట్ వైద్యులు
- ఖర్చు భరించలేకుంటే ప్రభుత్వాస్పత్రికి తీసుకెళ్లాలని సూచన
- ప్రాణాలు కాపాడేందుకు ప్రయత్నించిన ప్రభుత్వ వైద్యులు
- చివరకు మృతిచెందిన బాలింత



పసికందును చేతుల్లోకి తీసుకుని కంటతడి పెట్టిన వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి అంబటి మురళీకృష్ణ

పెదకాకాని: పండంటి బిడ్డకు జన్మనిచ్చిన తల్లి మృత్యువుతో పోరాడి ఓడిన సంఘటన ఉప్పలపాడులో చోటు చేసుకుంది. బంధువులు, వైద్య సిబ్బంది, స్థానిక పెద్దల నుంచి సేకరించిన సమాచారం ప్రకారం.. మేరి(24)కి తల్లిదండ్రులు లేకపోవడంతో పెదకాకాని మండలం ఉప్పలపాడు గ్రామంలో ఉన్న మేనమామ వద్ద పెరిగింది. అదే ప్రాంతానికి చెందిన నాగండ్ల కార్తీక్ అలియాస్ ఏసుబాబుతో మేరికి మూడేళ్ల క్రితం వివాహమైంది. వారి దాంపత్య జీవితంలో ఏడాదిన్నర పాప మానస. రెండో కాన్పుకు ఈనెల 13న గుంటూరులోని ప్రైవేట్ నర్సింగ్‌లో చేర్చారు. డాక్టర్లు ఆపరేషన్ చేయడంతో మగ బిడ్డకు జన్మనిచ్చింది. ప్రసవం జరిగిన గంటన్నర వ్యవధిలోనే తల్లి అపస్మారకస్థితిలోకి చేరడంతో అందుకు సంబంధించిన చికిత్స చేసే మిషనరీ మా వద్ద లేదు మరొక ఆసుపత్రికి వెళ్లాలని సూచించారు. ఎలాగైనా ప్రాణాలు కాపాడుకోవాలని ఆమెను సమీపంలో ఉన్న ప్రైవేట్ ఆసుపత్రిలో చేర్పించారు. చికిత్స ప్రారంభించిన గంటలోపే రూ.30 వేలు బిల్లు వసూలు చేయడంతోపాటు మా ఆసుపత్రిలో గంటకు రూ.20 వేల వరకూ ఖర్చు అవుతుందని అందుకు ఇష్టమైతే ఉండండి లేదంటే ప్రభుత్వా సుపత్రికి వెళ్లాలని సూచించారు. అంత పెద్ద మొత్తంలో వైద్య ఖర్చులు భరించలేక మేరిని అదేరోజు ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకు వెళ్లారు. అప్పటి నుంచి పదిరోజులపాటు ఆమెకు వెంటిలేటర్‌పైనే వైద్యం అందించారు. బిడ్డ ఆరోగ్యంగా ఉండటంతో ఇంటికి పంపించారు. పరిస్థితి విషమించి శుక్రవారం ఆమె మృతిచెందింది.

మృతురాలి కుటుంబానికి వైఎస్సార్ సీపీ అండ

ఉప్పలపాడులో మేరి మరణవార్త తెలిసిన వెంటనే శనివారం పొన్నూరు నియోజకవర్గ వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి అంబటి మురళీకృష్ణ అక్కడికి చేరుకున్నారు. మృతదేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. పదిరోజుల బిడ్డను ఆప్యాయంగా చేతుల్లోకి తీసుకుని కంటతడి పెట్టారు. బిడ్డకు జన్మనిచ్చిన మేరి చికిత్స పొందుతూ మృతి చెందడం బాధాకరమన్నారు. వారి కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలిపారు. మృతురాలి కుటుంబానికి వైఎస్సార్ సీపీ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. ఆయన వెంట ఎంపీపీ తుల్లి మిల్లి శ్రీనివాసరావు, స్థానిక నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.

క్లుప్తంగా

15 నుంచి సెల్ ఫోన్ సర్వీసెస్‌లో ఉచిత శిక్షణ

కొరిటెపాడు (గుంటూరు): యూనియన్ బ్యాంక్ గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణ సంస్థ ఆధ్వర్యంలో ఏప్రిల్ 15వ తేదీ నుంచి సెల్ ఫోన్ రిపేర్, సర్వీసెస్‌లో ఉచిత శిక్షణ కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్నట్లు సంస్థ డైరెక్టర్ జీ.బీ.కుమార్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. శిక్షణ కాలం 30 రోజులు ఉంటుందని, శిక్షణ సమయంలో ఉచిత భోజనంతో పాటు వసతి సౌకర్యం కల్పించ బడుతోందన్నారు. వయస్సు 19 నుంచి 45 సంవత్సరాల లోపు ఉండాలని సూచించారు. ఆసక్తి గల అభ్యర్థులు తెల్లరేషన్ కార్డు, ఆధార్ కార్డు జిరాక్స్ కాపీలు, నాలుగు పాస్‌పోర్టు సైజ్ ఫోటోలు, 10వ తరగతి పాస్ లేదా ఫెయిల్ జిరాక్స్ కాపీలతో ముందుగా పేర్లు నమోదు చేసుకోవాలని కోరారు. పూర్తి వివరాలకు యూనియన్ బ్యాంక్ ఆఫ్ గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణా సంస్థ, ఓల్డ్ బ్యాంక్ వీధి, కొత్తపేట, గుంటూరు, 0863-2336912, 9700687696, 8125397953, 9949930155 ఫోన్ నెంబర్లును సంప్రదించాలని ఆయన తెలియజేశారు.

గురుకుల ప్రవేశానికి దరఖాస్తుల ఆహ్వానం

తాడికొండ: రాష్ట్రంలోని ఏపీ గురుకుల విద్యాలయాల్లో 2024-25 విద్యా సంవత్సరానికి గాను 5వ తరగతిలో అన్ని సీట్లలో ప్రవేశానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు తాడికొండ ఏపీ గురుకుల పాఠశాల (సెంటర్ ఆఫ్ ఎక్సలెన్సీ) ప్రిన్సిపల్ పి.జోగారావు తెలిపారు. 5వ తరగతిలో చేరేందుకు అన్ని సీట్లలో, 6,7,8 తరగతులలో ఖాళీగా ఉన్న సీట్ల ప్రవేశానికి దరఖాస్తు చేసుకొని ప్రవేశ పరీక్షలో పాల్గొనాలని సూచించారు. ప్రవేశ పరీక్ష దరఖాస్తులను మార్చి 01వ తేదీ నుంచి మార్చి 31వ తేదీ వరకు ఏపీఆర్ఎస్ డాట్ ఏపీసీఎఫ్ఎస్ఎస్ డాట్ ఇన్ వెబ్‌సైట్ ద్వారా మాత్రమే సమర్పించాలని సూచించారు. అర్హులైన విద్యార్థులు ఆన్‌లైన్ ద్వారా మాత్రమే దరఖాస్తు చేసుకోవాలని, ఏప్రిల్ 25వ తేదీన అన్ని జిల్లా ప్రధాన కేంద్రాలలో ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు ప్రవేశ పరీక్ష ఉంటుందన్నారు. మైనార్టీ పాఠశాలల్లో చేరగోరు విద్యార్థులకు ప్రవేశ పరీక్ష లేకుండా నేరుగా ప్రవేశం కల్పించడం జరుగుతుంది కనుక.. అర్హులైన విద్యార్థులు ఈ సదావకాశాన్ని ఉపయోగించుకోవాలని సూచించారు.

మైనార్టీ బాలికల పాఠశాలలో ప్రవేశాలు

గుంటూరు ఎడ్యుకేషన్: సంగడిగుంటలోని ఏపీ మైనార్టీ బాలికల పాఠశాలలో 5,6,7,8 తరగతుల్లో ప్రవేశాలకు దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు పాఠశాల ప్రిన్సిపాల్ ఎ. బాలాశ్రీ శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. 5వ తరగతిలో ఎస్సీ, ఎస్టీ ఖాళీలతో పాటు 6,7,8 తరగతుల్లో మిగిలిన ఖాళీలను భర్తీ చేస్తామని, నేరుగా పాఠశాలతో పాటు 87126 25039 నంబర్లో సంప్రదించాలని సూచించారు.

ప్రాచీన ధర్మశాస్త్రాలను అధ్యయనం చేయాలి

ఆచార్య సూర్యప్రకాశరావు



మాట్లాడుతున్న వీసీ ఆచార్య సూర్యప్రకాశరావు

గుంటూరు ఎడ్యుకేషన్: న్యాయ శాస్త్ర విద్యార్థులు ప్రాచీన శాస్త్ర గ్రంథాలను అధ్యయనం చేయడం వలన విజ్ఞానం చేకూరుతుందని దామోదరం సంజీవయ్య జాతీయ న్యాయ విశ్వవిద్యాలయ ఉప కులపతి ఆచార్య డి.సూర్యప్రకాశరావు అన్నారు. జేకేసీ కళాశాలరోడ్డులోని జాగర్లమూడి చంద్రమౌళి (జేసీ) న్యాయ కళాశాల 33వ వార్షికోత్సవాన్ని శనివారం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన ఆచార్య సూర్యప్రకాశరావు మాట్లాడుతూ విద్యా సంస్కృతి ఉన్న కళాశాలల్లో విద్యను అభ్యసించడం వలన విద్యార్థులు విజయమార్గంలో నిలుస్తారని పేర్కొన్నారు. నాగార్జున ఎడ్యుకేషన్ సొసైటీ అధ్యక్షుడు డాక్టర్ రాయపాటి శ్రీనివాస్ మాట్లాడుతూ విద్యార్థుల్లో పోటీతత్వాన్ని పెంపొందించడానికి ప్రత్యేకంగా జాతీయ స్థాయి మూట్ పోటీలను ప్రతియేటా నిర్వహిస్తున్నట్లు చెప్పారు. కళాశాల కార్యదర్శి వేమన కుప్పుస్వామి మాట్లాడుతూ ఈ ఏడాది నుంచి కళాశాలలో ఐదేళ్ల బీబీఏ ఎల్ఎల్‌బీ కోర్సును ప్రారంభించినట్లు చెప్పారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టరు చిట్టినేని సుధాకర్ బాబు వార్షిక నివేదికను వివరించారు. ఈ సందర్భంగా విశ్వవిద్యాలయ పరీక్షల్లో ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో సూర్య ప్రకాశరావు సతీమణి డాక్టర్ డీకే సుజాత, కళాశాల ఉపాధ్యక్షుడు జాగర్లమూడి మురళీమోహన్, కార్యవర్గ సభ్యులు కొరప్రాటి రామారావు, డాక్టర్ పి.గోపీచంద్, రాయపాటి వెంకట కోటేశ్వర ప్రసాద్, గద్దె మంగయ్య, అధ్యాపకులు విద్యార్థులు పాల్గొన్నారు. ఈసందర్భంగా విద్యార్థినీ, విద్యార్థులు సాంస్కృతిక ప్రదర్శనలతో అలరించారు.

ఒకటి నుంచి పాలిసెట్‌కు ఉచిత శిక్షణ

గుంటూరు ఎడ్యుకేషన్: పాలిటెక్నిక్ కోర్సుల్లో ప్రవేశానికై ఏప్రిల్ 27న జరగనున్న ఏపీ పాలిసెట్-2024కు దరఖాస్తు చేసుకున్న విద్యార్థులకు మార్కెట్ సెంటర్లోని హిందూ కళాశాలలో ఒకటో తేదీ నుంచి ఉచిత శిక్షణ కల్పిస్తున్నట్లు కళాశాల కార్యదర్శి చెరువు రామకృష్ణమూర్తి తెలిపారు. శనివారం అమరావతి రోడ్డులోని హిందూ ఇంజినీరింగ్ కళాశాలలో ఉచిత శిక్షణా తరగతుల పోస్టర్ విడుదల చేశారు. ఏప్రిల్ ఒకటి నుంచి 25 వరకు నిపుణులైన అధ్యాపక బృందంచే ఉదయం 8.00 గంటల నుంచి 11 గంటల వరకు ఉచిత శిక్షణ తరగతులు నిర్వహిస్తామని, ఆసక్తి గల విద్యార్థులు హిందూ ఇంజినీరింగ్ కళాశాల కార్యాలయంలో నేరుగా సంప్రదించాలని సూచించారు. అదే విధంగా ఇతర సమాచారానికి 83329 11155, 93907 87574 నంబర్లలో సంప్రదించాలని తెలిపారు. కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్ డాక్టర్ పి. ఐజాక్ ప్రసాద్, వైస్ ప్రిన్సిపాల్ వజ్రాల నర్సిరెడ్డి, అధ్యాపకుడు కృష్ణార్జునరావు పాల్గొన్నారు.



పోస్టర్ విడుదల చేస్తున్న రామకృష్ణమూర్తి, ఐజాక్ ప్రసాద్ నర్సిరెడ్డి, కృష్ణార్జునరావు

గురుకుల ప్రవేశాలకు దరఖాస్తుల స్వీకరణ

గుంటూరు ఎడ్యుకేషన్: ఆంధ్రప్రదేశ్ గురుకుల విద్యాలయాల్లో (ఏపీఆర్ఎస్) వచ్చే విద్యాసంవత్సరానికి ఐదో తరగతిలో ప్రవేశంతో పాటు 6,7,8 తరగతుల్లో ఖాళీలను భర్తీ చేసేందుకు దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు కోరుతున్నట్లు ఏపీఆర్ఎస్ గుంటూరు జిల్లా కన్వీనర్ జె. శ్రీనివాసరావు శనివారం ఓ ప్రకటనలో తెలిపారు.

httpr://aprr. apcfrr.in వెబ్‌సైట్ ద్వారా రూ.100 రుసుంతో ఈనెల 31లోపు దరఖాస్తు చేయాలని తెలిపారు.

మైనార్టీ బాలుర పాఠశాలలో ప్రవేశాలు

పాత గుంటూరు నందివెలుగురోడులలోని ఏపీఆర్ఎస్ మైనార్టీ బాలుర పాఠశాలలో వచ్చే విద్యా సంవత్సరానికి కోస్తాంధ్రలో తొమ్మిది జిల్లాల పరిధిలోని మైనార్టీ విద్యార్థులు మే ఒకటో తేదీ నుంచి ప్రవేశ పరీక్షతో నిమిత్తం లేకుండా నేరుగా ప్రవేశాలు పొందవచ్చునని శ్రీనివాసరావు తెలిపారు. 5వ తరగతిలో 80 సీట్లతో పాటు 6,7,8 తరగతుల్లో ఖాళీగా ఉన్న సీట్లను భర్తీ చేస్తామని తెలిపారు. ఆంగ్ల మాధ్యమంలో బోధనతో పాటు ఐఎఫ్‌పీ, బైజూస్ కంటెంట్‌తో కూడిన ట్యాబ్‌లు, ఉచిత బోధన, వసతి సదుపాయాలతో పాటు క్రీడలు, వ్యాయామానికి తగిన ప్రాధాన్యత ఉంటుందని తెలిపారు. వివరాలకు నేరుగా పాఠశాలలోనూ 9849693011, 9399977561 నంబర్లలద్వారా సంప్రదించాలని సూచించారు.

వాహనాలు ఢీకొని ఇద్దరి మృతి

మంగళగిరి: నగర పరిధిలోని కాజ జాతీయ రహదారిపై శుక్రవారం గుర్తు తెలియని వాహనాలు ఢీకొని గుర్తు తెలియని ఇద్దరు వ్యక్తులు మృతి చెందిన ఘటన చోటు చేసుకుంది. రూరల్ పోలీసులు తెలిపిన వివరాల మేరకు కాజ ఖలీల్ భాయ్ హోటల్ జాతీయ రహదారిపై గుర్తు తెలియని వ్యక్తి అర్ధరాత్రి రోడ్డు దాటుతుండగా గుర్తు తెలియని వాహనం ఢీకొనడంతో మృతి చెందాడు. అదే విధంగా నారాయణ తీర్థుల ఆలయం శుక్రవారం తెల్లవారుజామున గుర్తు తెలియని వ్యక్తి రోడ్డు దాటుతుండగా గుర్తు తెలియని వాహనం ఢీకొనగా మృతి చెందినట్లు తెలిపారు. కాజ వీఆర్వో ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

లైంగిక దాడికి పాల్పడిన కానిస్టేబుల్ అరెస్ట్

క్రోసూరు: క్రోసూరు గ్రామానికి చెందిన యువతిపై శుక్రవారం లైగింక దాడికి పాల్పడిన సంఘటనలో నిందితుడైన పోలీసు కానిస్టేబుల్ ఎం.రవిబాబును శనివారం అరెస్ట్ చేసి కోర్టుకు హాజరుపరిచినట్లు ఎస్ఐ ఎం.షఫీ తెలిపారు. కిడ్నాప్, రేప్ సెక్షన్ల కింద అరెస్ట్ చేసినట్లు ఆయన పేర్కొన్నారు.

ఆర్టీసీ బస్సులో బంగారం మాయం

కారంపూడి నుంచి నరసరావుపేట వస్తున్న బస్సులో సంఘటన

నరసరావుపేట టౌన్: ఆర్టీసీ బస్సులో మహిళ బ్యాగ్ నుంచి బంగారు ఆభరణాలు అపహరణకు గురైన సంఘటన శనివారం చోటు చేసుకుంది. టూటౌన్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కారంపూడికి చెందిన బొల్లినేని వెంకట రమణ నరసరావుపేటకు వచ్చేందుకు కారంపూడిలో ఆర్టీసీ బస్సు ఎక్కారు. నరసరావుపేట పల్నాడు బస్టాండ్‌లో బస్సు దిగుతున్న సమయంలో బ్యాగ్ చూసుకోగా అందులోని బంగారు నగల సంచి కనిపించలేదు. దీంతో విషయాన్ని ఆమె బస్సు డ్రైవర్, కండెక్టర్‌కు తెలియజేసింది. ప్రయాణికులు బస్సు దిగకుండా జాగ్రత్త పడి విషయాన్ని కండక్టర్ పోలీసులకు సమాచారాన్నిచ్చారు. ఎస్ఐ అశోక్ సిబ్బందితో అక్కడికి చేరుకొని ప్రయాణికుల్ని క్షుణ్ణంగా పరిశీలించారు. అయినా ఎటువంటి ఫలితం లేకపోవటంతో బాధితురాలిని విచారించారు. హారం, నెక్లెస్ కలిపి సుమారు 13 సవర్ల విలువైన రెండు వస్తువులు చోరీ జరిగినట్లు ఆమె తెలిపింది. దీంతో బస్సులో అనుమానాస్పదంగా ఉన్న వారి గురించి ఆరా తీశారు. ముగ్గురు మహిళలు దుర్గిలో బస్సు ఎక్కి కారంపూడిలో దిగాల్సి ఉండగా వారు పేటసన్నిగండ్లలో దిగినట్లు కండక్టర్ ఎస్ఐకు వివరించారు. దీంతో వారు ముగ్గురు దొంగతనానికి పాల్పడి ఉంటారని పోలీసులు భావిస్తున్నారు. ఈ మేరకు బాధితురాలిచ్చిన ఫిర్యాదుతో దర్యాప్తు చేపట్టారు.

సామాజిక సంస్కర్త ముఖ్యమంత్రి జగనన్న

- మంగళగిరి సీటు చేనేత వర్గానికి కేటాయించడం అభినందనీయం
- నియోజకవర్గంలో జరిగిన అభివృద్ధి సంక్షేమం చూపి ఓట్లు అడిగే హక్కు వైఎస్సార్ సీపీకే ఉంది
- ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి (ఆర్కే)



మంగళగిరి: డాక్టర్ బాబా సాహెబ్ అంబేద్కర్, జ్యోతీరావు పూలే అడుగు జాడలలో నడుస్తూ సమసమాజం కోసం పాటుపడుతున్న సీఎం జగన్ మోహన్‌రెడ్డి గొప్ప సామాజిక సంస్కర్త అని ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి (ఆర్కే) కొనియాడారు. శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ మంగళగిరి సీటు బీసీ (పద్మశాలీయలకు) కేటాయించడంతో పాటు రాష్ట్రంలోని అన్ని వర్గాలకు సీట్లు కేటాయించి సమ సమాజ నిర్మాణానికి కృషి చేస్తున్నారన్నారు. మంగళగిరి నియోజకవర్గంలో గతంలో ఎన్నడూ లేని విధంగా అభివృద్ధి, సంక్షేమం అమలు చేసి చూపామన్నారు. చేసిన అభివృద్ధి సంక్షేమ పథకాలే వైఎస్సార్ సీపీ అభ్యర్థి మురుగుడు లావణ్యను గెలిపిస్తాయన్నారు. 2014 నుంచి 2019 వరకు అధికారంలో ఉన్న టీడీపీ చంద్రబాబు, మూడు శాఖల ముఖ్యమంత్రిగా వున్న నారా లోకేష్ ఏనాడైనా నియోజకవర్గం వైపు కన్నెత్తి చూశారా? ఒక్క పనైనా చేశారా అని నిలదీశారు. వైఎస్సార్ సీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత నియోజకవర్గంలో జరిగిన అభివృద్ధి టీడీపీ నాయకులకు కనిపించాలంటే ప్రజల్లోకి వెళ్లి అడగాలన్నారు. ఒక్క రూపాయి అవినీతి లేకుండా సంక్షేమ పథకాలు, అభివృద్ధి చేయడం జరిగిందన్నారు. చేసిన ఒక్కపని చెప్పుకోలేని టీడీపీకి నియోజకవర్గంలో ఓటు అడిగే హక్కే లేదన్నారు. చేసిన అభివృద్ధి పనులు చూపించి ఓటు అడిగే హక్కు వైఎస్సార్ సీపీకి మాత్రమే ఉందన్నారు. ఈ ఎన్నికలలో బీసీ పద్మశాలీయ మహిళ మురుగుడు లావణ్య అత్యధిక మెజార్టీతో విజయం సాధించడం ఖాయమని, లోకేష్‌కు మరో ఓటమి తథ్యమని స్పష్టం చేశారు.

గ్రామీణ క్రీడాకారులను గుర్తిస్తాం

- క్రీడాభివృద్ధి కృషిచేస్తాం
- ఆంధ్రక్రికెట్ అసోసియేషన్ కార్యదర్శి ఏఎస్ఆర్ గోపీనాథ్ రెడ్డి
- అంకిరెడ్డిపాలెంలో నూతన క్రికెట్ సబ్ సెంటర్ ఆరంభం



క్రికెట్ సబ్‌సెంటర్‌ను ప్రారంభిస్తున్న గోపీనాథ్ రెడ్డి

గుంటూరు రూరల్: గ్రామీణ ప్రాంతాల్లో క్రీడాకారులను గుర్తించి వారి క్రీడాభివృద్ధికి, అదేవిధంగా ప్రతి క్రీడాకారుడికి క్రీడా నైపుణ్యాన్ని పెంపొందించేందుకు కృషి చేస్తున్నామని ఆంధ్ర క్రికెట్ అసోసియేషన్ కార్యదర్శి ఏఎస్ఆర్ గోపీనాథ్ రెడ్డి పేర్కొన్నారు. శనివారం అంకిరెడ్డిపాలెం గ్రామంలో ఆంధ్ర క్రికెటర్ అసోసియేషన్, గుంటూరు జిల్లా క్రికెటర్ అసోసియేషన్ సంయుక్త నిర్వహణలో నూతన క్రికెట్ సబ్ సెంటర్ ప్రారంభించారు. కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొని ఆయన మాట్లాడుతూ అంకిరెడ్డిపాలెం గ్రామంలో అభివృద్ధి కార్యక్రమాల్లో భాగంగా మంచి క్రీడా ప్రాంగణాలు ఏర్పాటు చేసిన గ్రామ అభివృద్ధి కమిటీ, అధికారులు, సహాయ సహకారాలు అందించిన నాయకులను అభినందించారు. కార్యక్రమంలో ఆంధ్ర క్రికెట్ అసోసియేషన్ అపెక్స్ కౌన్సిల్ మెంబర్ పురుషోత్తమ రావు, జిల్లా క్రికెట్ అసోసియేషన్ అధ్యక్షులు ఎమ్మెస్ టీవీ రమణమూర్తి, జిల్లా కార్యదర్శి డి.రమేష్ కుమార్, గుంటూరు జిల్లా క్రికెటర్, అసోసియేషన్ సభ్యులు సీతాపతి, వాసు, మోహన్, మాజీ ఆంధ్ర క్రికెట్ అసోసియేషన్ రంజీ క్రీడాకారులు ఆస్కార్ వినోద్‌కుమార్, అసోసియేషన్ క్రికెట్ అడ్వైజరీ కమిటీ మెంబర్ మల్లికార్జున రావు, జిల్లా కోచ్‌లు సరస్వతిరెడ్డి, భాస్కర్ అంకిరెడ్డిపాలెం గ్రామ అభివృద్ధి కమిటీ సభ్యులు పెద్దలు అప్పిరెడ్డి, సంజీవరెడ్డి, డి.వీరగంగాధరరెడ్డి, కుర్రి పుల్లారెడ్డి, డి.రమేష్, శ్యామల రఘు రామిరెడ్డి, గ్రామ పెద్దలు, పలువురు క్రీడాకారులు పాల్గొన్నారు.

ముస్లిం హక్కుల పోరాట సమితి జిల్లా అధ్యక్షుడిగా ఇలియాస్



లక్ష్మీపురం: ముస్లిం సమస్యల పరిష్కారానికే ముస్లిం హక్కుల పోరాట సమితి ఏర్పాటు అయిందని, రాజకీయాలకు అతీతంగా ముస్లింల సమస్యలపై గత 10 సంవత్సరాలుగా సేవ చేస్తుందని ముస్లిం హక్కుల పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షుడు షేక్.ఖావలి అన్నారు. స్థానిక లాలాపేటలోని శనివారం నిర్వహించిన సమావేశంలో సమితి జిల్లా అధ్యక్షుడిగా షేక్.ఇలియాస్‌ను నియమితులయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం తెలుగుదేశం పార్టీ సీట్ల కేటాయింపులో ముస్లింలకు తక్కువ స్థానాలలో కేటాయించడం వారి వివక్షతకు నిదర్శనమని ధ్వజమెత్తారు. అనేక కార్పొరేషన్ పదవుల్లో చైర్మన్, డైరెక్టర్ పదవులను కేటాయించిన ముఖ్యమంత్రికి పూర్తి మద్దతుగా నిలవాల్సిందిగా పిలుపునిచ్చారు. జిల్లా అధ్యక్షుడిగా నియమితులైె షేక్.ఇలియాస్ మాట్లాడుతూ ముస్లిం హక్కుల పోరాట సమితి జిల్లాలోని అన్ని మండలాలలో పర్యటించి కమిటీల ఏర్పాటు చేస్తామన్నారు. కార్యక్రమంలో సమితి యువజన విభాగం అధ్యక్షులు పఠాన్ అమీర్‌ఖాన్, షేక్.రహీం, షేక్.అజీజ్, పల్నాడు జిల్లా అధ్యక్షులు షేక్.సిరాజ్, రాష్ట్ర కార్మిక నాయకులు షేక్.బాబు, నగర అధ్యక్షులు మీరావలి, షాకీర్, యాసీన్ తదితరులు పాల్గొన్నారు.

వైరల్




నా స్టూడెంట్ టీచర్ అయింది!

'ఎక్స్'లో రేవ్ అనే టీచర్ తన స్టూడెంట్ ఆలీషా గురించి చేసిన పోస్ట్ వైరల్ అయింది. స్కూల్ రోజుల్లో ఆలీషా అల్లరిపిల్ల. రేవ్ మాటల్లోనే చెప్పాలంటే రెబెల్. 'ఈ అమ్మాయి భవిష్యత్ ఎలా ఉండబోతుందో' అంటూ ఆలీషా గురించి బెంగపడేది రేవ్. కట్ చేస్తే... ఆలీషా ఇప్పుడు ముంబైలోని ఒక స్కూల్‌లో స్పెషల్ నీడ్స్ చిల్డ్రన్స్‌కు టీచర్. 'మొండిఘటం. ఏ పనీ చేయలేదు... అని నా గురించి రేవ్ టీచర్‌కు చెప్పేవారు. అయితే టీచర్ మాత్రం నన్ను ఎప్పుడూ ప్రేమగా చూసుకునేది. అలాంటి ప్రేమను స్పెషల్ నీడ్స్ చిల్డ్రన్స్‌కు పంచాలనుకుంటున్నాను' అంటుంది అలీషా.



ఈ హోలీ రంగులను హాయిగా తినవచ్చు!

ముంబైకి చెందిన ఇద్దరు సోదరుల ఇన్‌స్టాగ్రామ్ పోస్ట్ నెటిజనులను ఆకట్టుకుంటోంది. గౌరంగ్, సౌరభ్ అనే సోదరులు 'మాంక్స్ బూఫీ' బ్రాండ్‌పై 'అబీర్ హోలీ కలర్స్' పేరుతో సహజ రంగులను మార్కెట్‌లోకి తీసుకువచ్చారు. పువ్వులు, మొక్కజొన్న పిండి... మొదలైన వాటితో భిల్ తెగ గిరిజనులు తయారు చేసిన ఈ రంగులను తినవచ్చు కూడా!



లియాండర్ పేస్... ప్రముఖ డ్యాన్సర్!

'ఎక్స్'యూజర్ పృథ్వీ తన చిన్నారి మేనకోడలు వర్క్‌బుక్ నుంచి పోస్ట్ చేసిన స్నాప్‌చాట్ నెట్‌లోకంలో నవ్వులు పూయిస్తోంది. ఈ వర్క్‌బుక్‌లో'మ్యాచ్ ది ఫాలోయింగ్' శీర్షిక కింద ఎడమవైపు ప్రముఖుల పేరు, కుడివైపు ఆయా రంగాలకు సంబంధించిన బొమ్మలు ఇచ్చారు. ఏ వ్యక్తి ఏ రంగానికి చెందిన వారో జత చేయాలి. విరాట్ కోహ్లీ–క్రికెటర్, లతా మంగేష్కర్–సింగర్... ఇలా అన్నిటికీ కరెక్ట్‌గానే జత చేసింది ఆరు సంవత్సరాల చిన్నారి. అయితే లియాండర్ పేస్ దగ్గరే వచ్చింది పేచీ. ప్రభుదేవాతో పాటు లియాండర్ పేస్‌ను కూడా డ్యాన్సర్‌ని చేసింది. ఇది చూసి సరదాకారులు ఊరుకుంటారా ఏమిటి? మీమ్సే మీమ్స్!

వేడి వేడి ప్రెషర్ కుకర్ ఉండగా... ఐరన్ బాక్స్ దండగా

'లిమిటెడ్ రీసోర్స్ నుంచే కొత్త ఐడియాలు జనించునోయి' అని మరో సారి చెప్పడానికి ఈ వైరల్ వీడియో క్లిప్ సాక్ష్యం. కోల్‌కతాకు చెందిన మౌమితా చక్రవర్తి వేడి వేడి ప్రెషర్ కుక్కర్‌ను ఉపయోగించి షర్ట్‌ను ఐరన్ చేస్తున్న వీడియోను ఇన్‌స్టాగ్రామ్‌లో పోస్ట్ చేసింది. ట్విట్టర్‌లో రీపోస్ట్ చేసిన ఈ వీడియో రెండు లక్షల యాభై వేల వ్యూస్‌ను దాటింది.





లవ్ స్కానింగ్

ముంబైలోని మహాలక్ష్మీ రేస్‌కోర్స్ ప్రాంతంలో జరిగిన మ్యూజిక్ ప్రోగ్రామ్‌కు హాజరైన ఒక యువకుడి టీ షర్ట్ అందరి దృష్టిని ఆకర్షించింది. 22 సంవత్సరాల హార్దిక్ టీ షర్ట్ వెనకాల ఐ–క్యాచింగ్ మెసేజ్ 'ఫర్ సింగిల్ పీపుల్ వోన్లీ'తోపాటు క్యూ ఆర్ కూడా ఉంది. క్యూ ఆర్ కోడ్‌ను స్కాన్ చేస్తే నేరుగా అతడి టిండర్ ప్రొఫైల్‌లోకి తీసుకువెళుతుంది. హార్దిక్ డిజిటల్ ఫ్లర్టింగ్ అనేది టాకింగ్ పాయింట్ కావడమే కాదు సోషల్ మీడియాలో వైరల్ అయింది

బయోపిక్

సినిమాలు పాత కథలను తవ్వి పోస్తున్నాయి.
చరిత్ర గతిని వెండి తెర మీద పునఃసృష్టిస్తున్నాయి.
స్వాతంత్ర్య పోరాటంలో ఎన్నో ఘట్టాలు. ఎందరో త్యాగమూర్తులు.
కాని పురుషుల బయోపిక్‌లు వచ్చినట్టుగా స్త్రీలవి రాలేదు.
తాజాగా విడుదలైన 'అయ్ వతన్ మేరే వతన్' సినిమా
నాటి వీర వనిత ఉషా మెహతా జీవితాన్ని చూపింది.
బ్రిటిష్‌కు వ్యతిరేకంగా సీక్రెట్ రేడియో నడిపిన ఉషా మెహతా ఎవరు?

వెండి తెర మీద రహస్య రేడియో


ఉషా మెహతా

'దిసీజ్ కాంగ్రెస్ రేడియో కాలింగ్ ఆన్ 42.34 మీటర్స్ సమ్‌వేర్ ఇన్ ఇండియా'... ఈ అనౌన్స్‌మెంట్ బ్రిటిష్ వారిని గడగడలాడించింది. మునికాళ్ల మీద పరిగెత్తించింది. ఒక బుల్లి రహస్య రేడియో స్టేషన్‌ని, దాని నిర్వాహకులను అరెస్ట్ చేయడానికి పిచ్చెక్కినట్టు తిరిగేలా చేసింది. మూడు నెలల పాటు బ్రిటిష్‌వారిని ముప్పుతిప్పలు పెట్టిన ఆ రేడియో నిర్వాహకురాలి పేరు ఉషా మెహతా.

గాంధీ పిలుపు విని...

ఉషా మెహతా గుజరాత్‌లోని సూరత్ సమీపంలో ఉన్న సారస్ అనే ఊళ్లో 1920లో జన్మించింది. ఐదేళ్ల వయసులో గాంధీజీని అహ్మదాబాద్‌లో చూసింది. 8 ఏళ్ల వయసులో వాళ్ల ఊరి దగ్గర గాంధీజీ చరఖా కార్యక్రమం నిర్వహిస్తే ఉషా పాల్గొని కొద్దిసేపు చరఖా తిప్పింది. బాల్యంలోనే గాంధీజీ మీద గొప్ప భక్తి పెంచుకున్న ఉషా 12 ఏళ్ల వయసులో తండ్రి వృత్తిరీత్యా బొంబాయికి మారడంతో తన దేశభక్తిని చాటుకునే అవకాశం పొందింది.

డూ ఆర్ డై

1942 ఆగస్టు 8న బొంబాయిలో గాంధీజీ క్విట్ ఇండియా పిలుపునిచ్చారు. 'డూ ఆర్ డై' లేదా 'కరో యా మరో' నినాదాలు మిన్నంటాయి. 'ఇక భారత ప్రజలు నాయకుల కోసం ఎదురు చూడొద్దు. ప్రజలే నాయకులు' అని గాంధీజీ పిలుపునిచ్చారు. 22 ఏళ్ల ఉషా మెహతా తన స్నేహితులైన విఠల్ దాస్ ఖాకడ్, చంద్రకాంత్ ఝావేరీ, బాబూభాయ్ ఠక్కర్‌లతో కలిసి ఆ మీటింగ్‌కు వెళ్లింది. ఉత్తేజితురాలైంది. అప్పటికే స్వతంత్రోద్యమ వార్తల మీద బ్రిటిష్ ప్రభుత్వం నిషేధం విధించింది. ఉద్యమం ఉధృతం కావాలంటే రేడియో మాధ్యమం ద్వారా వార్తలు అందించాల్సిన అవసరం ఉందని ఉషా మెహతా తన స్నేహితులతో చెప్పింది. దేశం కోసం ఏ త్యాగానికైనా సిద్ధపడాలని పిలుపునిచ్చింది.


'అయ్ వతన్ మేరే వతన్'లో సారా అలీఖాన్

రహస్య కాంగ్రెస్ రేడియో

బ్రిటిష్ ప్రభుత్వంలో జడ్జిగా పని చేస్తున్న తండ్రి నివారించినా వినకుండా ఇంటి నుంచి వెళ్లిపోయిన ఉషా బొంబాయిలో షికాగో రేడియో ట్రాన్స్‌మిషన్‌ను చూస్తున్న మరో మిత్రుడు మోత్వాని సహాయంతో సొంత ట్రాన్స్‌మిటర్‌ను సంపాదించింది. మిత్రులతో ఒక ఫ్లాట్ అద్దెకు తీసుకుని రేడియో స్టేషన్‌గా మలిచింది. ఆగస్టు 27, 1942న మొదటి చరిత్రాత్మక ప్రసారాన్ని సొంత గొంతుతో చేసింది. 'దిసీజ్ కాంగ్రెస్ రేడియో 42.34 మీటర్స్ సమ్‌వేర్ ఇన్ ఇండియా'... అంటూ స్వాతంత్రోద్యమ వార్తలు వినిపించింది. ఆ క్షణం నుంచి ఆ రహస్య రేడియో కోసం బ్రిటిష్ అధికారులు, పోలీసులు కంటి మీద కునుకు లేకుండా వెతకసాగారు. ప్రసారాలు బొంబాయి నుంచే నిర్వహిస్తున్నా దేశంలో ఎక్కడి నుంచి అవుతున్నాయో తెలియక గింజుకున్నారు.

మూడు నెలలు

రహస్య రేడియో ప్రసారాలు మూడు నెలలు సాగాయి. కాని పరికరాలు సమకూర్చిన మోత్వాని లొంగిపోయి రేడియో స్టేషన్ చిరునామా చెప్పేశాడు. నవంబర్ 12, 1942న పోలీసులు దాడి చేసి ఉషా మెహతాను అరెస్ట్ చేశారు. ఆరు నెలల పాటు ఆమెను ఇంటరాగేట్ చేశారు. 4 ఏళ్ల జైలు శిక్ష పడింది. ఉషా ఏ మాత్రం జంకలేదు. 1946 నాటి మధ్యంతర ప్రభుత్వ హయాంలో మురార్జీ దేశాయ్ హోమ్ మినిస్టర్‌గా ఉండగా ఆమె విడుదల జరిగింది. కాని జైలు జీవితం ఆమె ఆరోగ్యాన్ని బాగా దెబ్బ తీసింది. బయటకు వచ్చాక ఆమె చదువు కొనసాగించి ముంబై యూనివర్సిటీలో ప్రొఫెసర్‌గా పనిచేసి 1980లో రిటైర్ అయ్యింది. గాంధీజీ భావజాలాన్ని ప్రచారం చేస్తూ 2000 సంవత్సరంలో తుది శ్వాస విడిచింది.

ఉషా మెహతా జీవితం ఆధారంగా నిర్మించిన బయోపిక్ 'అయ్ వతన్ మేరే వతన్' అమేజాన్‌లో మార్చి 21న విడుదలైంది.

హెల్త్

వృత్తిపరమైన శబ్దాలు... వినికిడి సమస్యలు!

చెవులకు హెడ్‌ఫోన్స్ తగిలించుకుని... కళ్లను కంప్యూటర్ స్క్రీన్‌కు అప్పగించి గంటలు గంటలు ఉద్యోగం చేసే వాళ్లను ఐటీ ఆఫీసుల్లో చూస్తుంటాం. పైకి స్టయిలిష్‌గా కనిపించినా దీర్ఘకాలంలో ఇలాంటి ఉద్యోగాలు వినికిడి శక్తిని దెబ్బతీస్తాయి. ప్రకంపనలు నేరుగా చెవుల్లోకి చొచ్చుకెళ్ళి కర్ణభేరిని తాకుతుండటం వల్ల వినికిడి వ్యవస్థ (ఆడిటరీ సిస్టమ్)కు హాని జరిగే అవకాశాలు ఎక్కువ. వృత్తిపరంగా వచ్చే ఈ వినికిడి సమస్యల నివారణ, దానిని అధిగమించడం ఎలా అనే దానిపై అవగాహన కోసం ఈ కథనం.



పని ప్రదేశమంటే పట్టణాలు, నగరాల్లో రకరకాల వస్తు తయారీ పరిశ్రమలు, గనుల తవ్వకం, భారీ యంత్రసామగ్రి, ఉపకరణాల చప్పుళ్లే కాదు... పల్లెల్లోని వ్యవసాయ పనుల్లోనూ మోటర్ల వాడకం... వంటివి శబ్దాలకు కారణమై దీర్ఘకాలంలో వినికిడి సమస్యలకు దారితీసేవి. దీనికి తోడు నిశ్శబ్దంగా ఉండే పని ప్రదేశంలోనూ హెడ్‌ఫోన్స్, ఇయర్‌ఫోన్స్ వాడకమూ పెరగడంతో వినికిడి సమస్యలు వచ్చే అవకాశాలూ పెరిగాయి.

మరికొన్ని అంశాలు...

● **శబ్దాల తీవ్రత :** శబ్దాల తీవ్రత 85 డెసిబుల్స్‌కు మించడం.

● **శబ్దాలకు ఎక్స్‌పోజ్ అయ్యే వ్యవధి :** శబ్దాలకు ఎంత ఎక్కువగా ఎక్స్‌పోజ్ అయితే వినికిడి సమస్యకు అంతగా అవకాశం ఎక్కువ. ● తమ ప్రమేయం లేకుండానే మరికొన్ని అంశాలు కూడా వృత్తిపరమైన వినికిడి సమస్యకు కారణమవుతాయి. ఉదాహరణకు జన్యుపరంగా వచ్చే సమస్యల తోపాటు వయసు పెరుగుతున్న కొద్దీ వినికిడి శక్తి తగ్గడం వంటివి

వృత్తిపరమైన వినికిడి సమస్యలు ప్రభావాలూ - పర్యవసానాలు

● **కమ్యూనికేషన్స్ కష్టం కావడం :** మాటలు అర్థంగాక కమ్యూనికేషన్‌కు అవరోధాలు ఏర్పడతాయి. ఫలితంగా చేయాల్సిన పనులు కుంటుపడతాయి.

● **వృత్తిపరమైన సామర్థ్యాలు తగ్గడం :** వినికిడి సమస్యలు పెరగడంతో వృత్తిపరమైన సామర్థ్య లోపాలు కనిపిస్తాయి.

● **భద్రతలో ముప్పు :** కొన్ని శబ్దాలు వినిపించకపోవడం లేదా కొన్ని హెచ్చరికలను వినలేకపోవడంతో పని ప్రదేశంలో ప్రమాదాలకు గురికావడం, గాయపడటం వంటి ముప్పు ఉంటుంది.

● **మానసికమైన దుష్ప్రభావాలు :** తమకు సరిగా వినిపించడం లేదన్న వాస్తవం చాలామందిని సామాజిక ఒంటరితనంలోకి నెడుతుంది, యాంగ్జైటీ, డిప్రెషన్‌కు లోనవుతారు.

నివారణ...

వినికిడి సమస్యలు రెండు రకాలు. మొదటిది తాత్కాలికం. రెండోది శాశ్వతం. తాత్కాలిక సమస్య తగ్గేందుకు అవకాశాలు ఎక్కువే అయినా ఒకసారి వినికిడి సమస్య ఏర్పడితే అది పూర్తిగా నయం కావడం కష్టం. శాశ్వత వినికిడి సమస్యకు దారితీసే అవకాశాలు ఎక్కువ. అందుకే నివారణకు ముందు నుంచే తగిన చర్యలు తీసుకోవాలి. అవి...

● **ఇంజనీరింగ్ కంట్రోల్స్‌తో :** శబ్దాలు తక్కువగా వచ్చేలాంటి యంత్రాల రూపకల్పన, ఆ మేరకు మార్పులు, సౌండ్‌ప్రూఫింగ్, మెటీరియల్ మార్చడం ద్వారా తక్కువ శబ్దాలు వచ్చే ఉపకరణాల తయారీ వంటి జాగ్రత్తలు పాటించడం.

● **వ్యక్తిగతమైన రక్షణ ఉపకరణాలు :** శబ్దాల విపరీతంగా వినిపించే చోట చెవులను రక్షించే కొన్ని సాధనాలు (ఉదాహరణకు ఇయర్ ప్లగ్స్ లాంటివి) వాడటం.

● **శిక్షణ – అవగాహనలు :** పెద్ద శబ్దాలతో చెవులు, వినికిడి విషయంలోనే గాక ఇతరత్రా ఆరోగ్య అంశాల్లో కలిగే చేటు వంటి అంశాలపై అవగాహన కల్పించడం, వాటి నివారణకు అవసరమైన చర్యల్లో శిక్షణ ఇవ్వడం, శబ్దాలను ఎలా నియంత్రించాలో తెలపడం, వినికిడి తగ్గినట్లుగా తెలుసుకునే లక్షణాలను గుర్తించడమెలా అన్న విషయంపై అవగాహన కల్పించడం, ఆ తర్వాత చేయాల్సిన పనులు, డాక్టర్లను కలవాల్సిందెప్పుడో తెలుసుకునేలా వివరించడం.

నిర్ధారణ పరీక్షలు...

ఆడిటరీ పరీక్షలు అని పిలిచే కొన్ని రకాల వినికిడి సామర్థ్య పరీక్షలతో పాటు మరికొన్ని ఇతరత్రా సాధారణ ఆరోగ్య పరీక్షలు.

చికిత్స...

● తాత్కాలిక వినికిడి సమస్యలు కలిగినప్పుడు వెంటనే డాక్టర్‌ను కలిస్తే వారు తగిన చర్యలను సూచించి, పరిస్థితి మరింత దిగజారకుండా చేస్తారు. ● కొన్నిసార్లు కాక్లియాలో సమస్యలు వచ్చినప్పుడు (సడన్ హియరింగ్ లాస్ లేదా కాక్లియార్ మైక్రో సర్క్యులేషన్ డిస్టర్బెన్సెస్ వంటి కేసుల్లో) కొన్ని రకాల స్టెరాయిడ్స్ ద్వారా వినికిడిని మెరుగుపరచేందుకు ప్రయత్నిస్తారు.

● కొన్ని రకాల వినికిడి సమస్యలకు తగిన వినికిడి ఉపకరణాలను బాధితులకు తగిన ఫ్రీక్వెన్సీలో అమర్చడం ద్వారా సమస్యను చక్కదిద్దుతారు. ● మరికొన్ని రకాల వినికిడి సమస్యలకు చివరి పరిష్కారంగా శస్త్రచికిత్స కూడా అవసరం పడవచ్చు.


డాక్టర్ మోగంటి అశోక్ పృథ్వీరాజు, కన్సల్టెంట్ ఈఎన్‌టీ సర్జన్

మెడి టిప్

పాదాల నొప్పి తగ్గడం ఎలా?



మడమ కింది భాగం నుంచి కాళ్ల వేళ్ల వద్ద ఉండే ఎముకల వరకు... మొత్తం పాదాన్నంతా 'ప్లాంటార్ ఫేషియా' అంటారు. అది ఎముకనూ, కండరాలనూ కలుపుతుంది. దీనికి సాగే గుణం ఎక్కువ. ఈ ఫేషియాకు గాయం తగిలినా లేదా వయసు పెరిగే కొద్దీ ఫేషియా సాగే గుణం తగ్గడం వల్ల పాదాల నొప్పి రావడం సాధారణం.

పాదాల నొప్పుల తగ్గడానికి కొన్ని సూచనలు...

● పాదంపై పడే భారాన్ని బాగా తగ్గించి, తగినంత విశ్రాంతినివ్వాలి. ● పాదం మధ్యలో ఒంపు తిరిగి ఉన్న భాగానికి సపోర్ట్ ఇచ్చేలా ఉండే పాదరక్షలను ఎంచుకోవాలి. ● ఫేషియాను సాగేలా చేసేవీ, కాలి కండరాలను బలపరిచేవీ అయిన కొన్ని రకాల వ్యాయామాల సహాయంతో పాదాల నొప్పులు తగ్గుతాయి. ఈ సూచనలు పాటించాక కూడా నొప్పి తగ్గకపోతే అప్పుడు డాక్టర్‌ను తప్పక సంప్రదించాలి.

ప్రతి మహిళా గర్భం ధరించినప్పటినుంచి కొన్ని వ్యాక్సిన్లు తీసుకోవాల్సి ఉంటుంది. మరికొన్ని గర్భవతి కాకముందే తీసుకోవాల్సినవీ ఉంటాయి. అలాగే గర్భవతులు అసలు తీసుకోకూడని వ్యాక్సిన్లు కూడా ఉండవచ్చు. అందుకే ఇన్ఫెక్షన్లు రాకుండా ఉండేందుకు తీసుకోవాల్సిన వ్యాక్సిన్ల గురించి మహిళలకు... ముఖ్యంగా కుటుంబ సభ్యులకు అవగాహన ఉండాలి. సెంటర్ ఫర్ డిసీజ్ కంట్రోల్ అండ్ ప్రివెన్షన్ (సీడీసీ) మార్గదర్శకాల ప్రకారం... గర్భిణులూ - వారు తీసుకోవాల్సిన వ్యాక్సిన్లపై అవగాహన కోసం ఈ కథనం.

గర్భిణులు... వ్యాక్సిన్‌లు!

ముందే తీసుకోవలసిన వ్యాక్సిన్లు

ప్రెగ్నెన్సీకి ప్లాన్ చేసుకున్నప్పుడే మీజిల్స్, మంప్స్, రుబెల్లా, చికెన్ పాక్స్ వంటి వ్యాక్సిన్లను తీసుకోవాలి. ఎందుకంటే గర్భం ధరించిన తర్వాత ఈ వ్యాక్సిన్లు తీసుకోవడం మంచిది కాదు. రొటీన్ వ్యాక్సినేషన్ కార్యక్రమంలో భాగంగా మీజిల్స్, మంప్స్, రుబెల్లా (ఎమ్ఎమ్ఆర్) వంటి వ్యాక్సిన్‌లను చిన్నప్పుడు తాము తీసుకున్నారా లేదా అనే సందేహం ఉంటే ఆ విషయాన్ని డాక్టర్‌తో తప్పక చెప్పాలి. అప్పుడు ఒక రక్తపరీక్ష ద్వారా ఆ మహిళ ముందుగానే ఎమ్ఎమ్ఆర్ వ్యాక్సిన్ తీసుకొని ఉన్నారా, లేదా నిర్ధారణ చేసి అంతకుముందు తీసుకుని ఉండకపోతే ఇస్తారు.

● **గర్భిణికి వారిసెల్లా (చికెన్‌పాక్స్) వైరస్** వల్ల బిడ్డలో పుట్టుకతోనే కొన్ని సమస్యలు వచ్చే అవకాశం ఉంది. ఒక చిన్న రక్తపరీక్షతో గతంలోనే చికెన్‌పాక్స్ వ్యాక్సిన్ తీసుకున్నారో లేదో తెలుసుకుని, తీసుకోకపోతే ప్రెగ్నెన్సీ ప్లానింగ్‌కు నెల రోజుల ముందే దాన్ని తీసుకోవడం మంచిది.

● **హ్యూమన్ పాపిలోమా వైరస్:** హెచ్‌పీవీ అని పిలిచే ఈ వ్యాక్సిన్‌ను అమ్మాయిలు తమ పన్నెండేళ్ల వయసు నాటి నుంచి 45 ఏళ్ల వరకు ఎప్పుడైనా తీసుకోవచ్చు. అయితే గర్భం దాల్చకముందే దీన్ని తీసుకోవాలి. గర్భంతో ఉన్నప్పుడు తీసుకోకూడదు. అవసరమైతే ఆ తర్వాత (అంటే ప్రెగ్నెన్సీ లేని టైమ్‌లో) తీసుకోవచ్చు.

ప్రతి గర్భిణీ తీసుకోవాల్సిన వ్యాక్సిన్‌లు...

● ఇన్‌ఫ్లుయెంజా (ఫ్లూ) వ్యాక్సిన్: మహిళలందరూ దీన్ని తీసుకోవాలి, గర్భవతులు తప్పనిసరిగా తీసుకోవాలి. గర్భధారణ సమయంలో దీన్ని తీసుకోవడం వల్ల పిండంపై దుష్ప్రభావం పడుతుందా లేదా అనే దిశగా ఎటువంటి అధ్యయనాలు లేవు. అయితే గర్భం ధరించి ఉన్నప్పుడు తీసుకుంటే బిడ్డ పుట్టాక మొదటి ఆర్నెల్లపాటు చిన్నారికీ అది రక్షణ ఇస్తుంది. కాబట్టి నిర్భయంగా తీసుకోవచ్చు. ఫ్లూ వల్ల గర్భవతిలో చలి జ్వరం, కండరాల నొప్పులు, దగ్గు, గొంతు బొంగురు పోవడం వంటి లక్షణాలు కనిపిస్తాయి.

● **టెటనస్, డిఫ్తీరియా, పెర్టుసిస్ (డీపీటీ) వ్యాక్సిన్ :** బాధితుల్లో ఒకవేళ టెటనస్ వచ్చినట్లయితే కండరాలు బిగుసుకు పోయినట్లుగా అయ్యి, అసాధారణంగా ప్రవర్తిస్తాయి. డిఫ్తీరియా వస్తే గొంతు లోపల వెనక భాగంలో ఒక మందపాటి పొరగా ఏర్పడి, శ్వాస సమస్యలకు కారణమవుతుంది. ఆగకుండా వచ్చే 'కోరింత దగ్గు' (పెర్టుసిస్) మహిళల్ని ఎంతో బాధిస్తుంది. అందుకే ఈ మూడు ఇన్ఫెక్షన్ల నుంచి రక్షించుకోడానికి గర్భవతి విధిగా డీపీటీ వ్యాక్సిన్ తీసుకోవాలి.

టీ డాప్ అంటూ సంక్షిప్తంగా పిలిచే ఈ వ్యాక్సిన్‌ను గర్భం ధరించిన ప్రతిసారీ... గర్భధారణ తర్వాత 20 వారాలప్పుడు తీసుకోవాలి. కుదరని పక్షంలో 27వ వారం నుంచి 36వ వారం మధ్యలోనూ తీసుకోవచ్చు.

హెపటైటిస్ బి వ్యాక్సిన్ : కాలేయానికి ఇన్‌ఫ్లమేషన్ (వాపు, మంట) కలగజేసే హెపటైటిస్ బి వైరస్ చాలా తీవ్రమైనది. అందుకే హెపటైటిస్ బిని నివారించడానికి ఇప్పుడు బిడ్డ చిన్నవయసులో ఉండగానే మూడు మోతాదుల హెపటైటిస్ బి ఇవ్వడం మొదలైంది. ఈ వ్యాక్సిన్ తీసుకుంటే గర్భస్థ శిశువుకు హాని జరిగినట్టు ఎటువంటి అధ్యయనాలూ లేవు కాబట్టి నిర్భయంగా ఈ వ్యాక్సిన్ తీసుకోవచ్చు.

కోవిడ్ వ్యాక్సిన్ : కోవిడ్ వ్యాక్సిన్ ఎప్పుడైనా తీసుకోవచ్చు. ప్రెగ్నెన్సీ టైమ్‌లో తీసుకున్నా ఇబ్బంది లేదు.

రెస్పిరేటరీ సిన్సీషియల్ వైరల్ వ్యాక్సిన్: ఈ వ్యాక్సిన్‌ను కూడా 32 వారాల నుంచి 36 వారాల ప్రెగ్నెన్సీ సమయంలో తీసుకోవచ్చు.

కొందరికి మాత్రమే వాడాల్సిన వ్యాక్సిన్లు...

కొంతమంది గర్భవతులకు కొన్ని అంశాల్లో ముప్పును నివారించడానికి వారి పరిస్థితిని బట్టి వాళ్ల నిర్దిష్టంగా తీసుకోవాల్సిన వ్యాక్సిన్‌లు ఇవి...

న్యూమోకాకస్ వ్యాక్సిన్: న్యూమోకాక్సీ అనేది ఒక రకం బ్యాక్టీరియా. దీనివల్ల నిమోనియాతో పాటు మరెన్నో ఇన్ఫెక్షన్లు రావచ్చు. ఉదాహరణకు చెవి ఇన్ఫెక్షన్స్, మెనింజైటిస్ వంటివి.



కొందరు హై రిస్క్ మహిళలకు న్యూమోకాకల్ ఇన్ఫెక్షన్స్ సోకకుండా ఈ వ్యాక్సిన్ వాడాలి. వాస్తవానికి ఈ వ్యాక్సిన్‌ను గర్భధారణకు ముందే ఇవ్వడం మంచిది. అయితే... ఇది గర్భధారణ తర్వాత మొదటి మూడు త్రైమాసికాలలో ఎప్పుడైనా తీసుకోవచ్చు.

ఎల్లో ఫీవర్ వ్యాక్సిన్ : ఇది విదేశాలకు చెందిన దోమల ద్వారా వ్యాపించే ఒక రకం వైరల్ జ్వరం. దీని వల్ల కాలేయం, కిడ్నీలు దెబ్బతినడమే కాదు... ఒక్కోసారి తీవ్ర అంతర్గత రక్తస్రావంతో మరణం కూడా సంభవించవచ్చు. ఈ వ్యాధి మన దేశంలో లేదు గానీ... గర్భధారణ సమయంలో వృత్తిపరంగా కొన్ని ఆఫ్రికా దేశాలకు వెళ్లాల్సిన మహిళలు తప్పనిసరిగా ఈ వ్యాక్సిన్ తీసుకోవాలి. ఇందుకోసం సాంక్రమిక వ్యాధుల (ఇన్ఫెక్షియస్ డిసీజెస్)కు చికిత్స చేసే నిపుణుల ఆధ్వర్యంలో తీసుకోవడం మంచిది.

ఇవిగాక మరికొన్ని... ఇవేకాకుండా గర్భవతులు అవసరాన్ని బట్టి మరికొన్ని వ్యాక్సిన్లు తీసుకోవాల్సి ఉంటుంది. ఉదాహరణకు కలరా, మెనింగోకోకస్, రేబీస్, జపనీస్ ఎన్‌కెఫలైటిస్, టైఫాయిడ్, హీమోఫీలస్ ఇన్‌ఫ్లుయెంజా బీ వంటి వ్యాక్సిన్లను... ఆయా మహిళల వ్యక్తిగత ఆరోగ్య పరిస్థితిని బట్టి... డాక్టర్ల సూచనలకు లోబడి తీసుకోవాల్సి ఉంటుంది.

గర్భిణికి ఇవ్వకూడని వ్యాక్సిన్

జీవించి ఉండే వైరస్‌తో తయారు చేసే వ్యాక్సిన్ అయిన జోస్టర్ వ్యాక్సిన్‌ను గర్భవతికి ఎట్టిపరిస్థితుల్లోనూ ఇవ్వకూడదు. మామూలుగా దీన్ని 50 ఏళ్లు, అంతకు పైబడిన లేదా గర్భధారణ వయసు మీరిన వారికే ఎక్కువగా సిఫార్సు చేస్తుంటారు.


డా. కావ్యప్రియ వజ్రాల, కన్సల్టెంట్ అబ్‌స్టెట్రీషియన్ అండ్ గైనకాలజిస్ట్